# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 233 బుధవారం | 20 మార్చి 2024 | పేజీలు : 08 | వెల రూ. 5





## మీ ఓటు మోదీ కోసమే..

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టాలి

మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్




## పిచ్చుకలను బతకనిద్దాం..

ప్రకృతిని కాపాడడం అందరి బాధ్యత

పర్యావరణ ప్రేమికురాలు డాక్టర్ అనితా రెడ్డి




## కొనుగోళ్లు, బ్యాంకు లావాదేవీలపై ఆరా

వివరాలు సమర్పించాలంటూ కలెక్టర్ ఆదేశం

వివిధ శాఖల అధికారులతో డిస్ట్రిక్ట్ ఇంటెలిజెన్స్ కమిటీ సమావేశం




## పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం తగదు

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే




# అటు ఇటు నేనే..

నిబంధనలకు విరుద్ధంగా రెండు రాష్ట్రాల్లో ఓటు హక్కు

సెటిలర్లలో ఆందోళన

రెండు రాష్ట్రాల్లో ఒకే దఫా ఎన్నికలపై అయోమయం

10 లక్షల పైనే ఓటర్లు ఉంటారని అంచనా


వివరాలు 2లో..


ఇంతకాలం అటు నేనే.. ఇటు నేనే అన్నట్లు రెండు ప్రాంతాల్లో ఓటు హక్కును వినియోగించుకున్న సెటిలర్ల గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లయింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఒకే దఫా ఎన్నికలు రావడంతో వారు అయోమయానికి గురవుతున్నారు. రెండు రాష్ట్రాల్లో ఓటు హక్కు కలిగిన వారు కచ్చితంగా ఎంత మంది ఉన్నారో లెక్క తేలక పోయినా వారు ఎన్నికలను మాత్రం ప్రభావితం చేస్తారన్న ప్రచారం ఉంది. అయితే దేశ పౌరులు ఎవరైనా ఎక్కడ నివసిస్తే అక్కడే ఓటు హక్కు కలిగి ఉండాలన్న భారత ఎన్నికల కమిషన్ నిబంధనను తుంగలో తొక్కిన పలువురు సెటిలర్లు అటు సొంత ఊరుతోపాటు ఉద్యోగం, వ్యాపారం నిర్వహిస్తున్న హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో ఓటు హక్కును కలిగి ఉన్నారు. రెండు ప్రాంతాల్లో ఓటు హక్కు కలిగి ఉన్న వారిని గుర్తించేందుకు ప్రత్యేక సాఫ్ట్ వేర్ లేకపోవడంతో ఇంతకాలం ఇష్టానుసారంగా సాగింది. అయితే రెండు రాష్ట్రాల్లో ఒకే సారి ఎన్నికలు రావడంతో వారు ఎక్కడ ఓటు వేయాలో తేల్చుకోలేక తికమక పడుతున్నారు. - వరంగల్ వాయిస్, వరంగల్

# అటు ఇటు నేనే..

**నిబంధనలకు విరుద్ధంగా రెండు రాష్ట్రాల్లో ఓటు హక్కు**

**సెటిలర్లలో ఆందోళన**

**రెండు రాష్ట్రాల్లో ఒకే దఫా ఎన్నికలపై అయోమయం**

**10 లక్షల పైనే ఓటర్లు ఉంటారని అంచనా**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణలో ఉన్న సెటిలర్లు ఆంధ్రకు వెళ్లి ఓటేయకుండా చూడాలన్న బెంగ లేకుండా పోయింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఒకే దఫా ఎన్నికలు జరగనుండడంతో ఇటువారు అటు..అటువారు ఇటు వచ్చి ఓటేసే చాన్స్ లేకుండా పోయింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఒకే రోజు పోలింగ్ నిర్వహించేలా ఎన్నికల కమిషన్ ప్రకటించింది. దీంతో ఈ రెండు రాష్ట్రాల్లో ఒకే విడత పోలింగ్ జరిగితే లాభం ఎవరికి, నష్టం ఎవరికి అన్న చర్చ రాజకీయ వర్గాలలో జోరుగా జరుగుతోంది. ఈ రెండు రాష్ట్రాలకు నాలుగో విడతలో మే 13న పోలింగ్ జరుగుతుంది. ఏపీలో పార్లమెంటుతో పాటు అసెంబ్లీకి కూడా ఎన్నికలు జరుగుతున్నాయి. దీంతో రెండు రాష్ట్రాల్లో ఒకే విడత పోలింగ్‌పై చర్చ ఊపందుకుంది.



### వేర్వేరుగా..

గతంలో తెలంగాణ, ఏపీలకు వేర్వేరుగా పోలింగ్ జరిగేది. తెలంగాణ మొత్తం ఒక విడతలో, ఏపీ మొత్తం మరో విడతలో పోలింగ్ జరిగేది. దీంతో ఏపీ నుంచి హైదరాబాద్ చుట్టు పక్కల సెటిల్ అయిన వాళ్లు ఇటు తెలంగాణ, అటు ఏపీ రెండు చోట్ల ఓటు వేసేవారన్న ఆరోపణలు ఉన్నాయి. వాస్తవంగా ఓటర్ ఐడీ కార్డుకు ఆధార్ అనుసంధానం చేస్తే డూప్లికేషన్ లేకుండా పోయేది. కానీ ఆధార్ అనుసంధానం లేక పోవడంతో రెండు, మూడు చోట్ల ఓటరుగా నమోదు చేసుకున్న వాళ్లను ఎన్నికల కమిషన్ గుర్తించలేక పోతోంది. అనేక మంది తాము పని చేసే చోట, వ్యాపారం నిర్వహించే ప్రాంతంతో పాటు తమ సొంత గ్రామంలో కూడా రెండు, మూడు ప్రాంతాల్లో ఓటరుగా నమోదు చేసుకున్నారు. ఇలా ఓటరుగా నమోదు చేసుకున్న చాలా మంది సెటిలర్లు రెండు విడతలుగా పోలింగ్ జరగడంతో రెండు చోట్ల ఓట్లు వేసేవారన్న ఆరోపనలున్నాయి.

### వారు ఎటువైపు..

తెలంగాణ, ఏపీలకు ఒకేసారి పోలింగ్ జరుగుతుండడంతో ఆంధ్ర సెటిలర్లు ఎక్కడినుంచి తమ ఓటు హక్కును వినియోగించుకుంటారన్న ఆందోళన మొదలైంది. రెండు రాష్ట్రాల్లో ఓటు హక్కు కలిగిన వారు కచ్చితంగా ఎంత మంది ఉన్నారో లెక్క తేలక పోయినా రమారమి పది లక్షల పైనే ఉంటారని, వారు ఎన్నికలను ప్రభావితం చేస్తారన్న ప్రచారం ఉంది. అయితే తమకు రాజకీయ ప్రయోజనాలు ఎక్కడ ఎక్కువగా ఉంటే అక్కడికే వెళుతారా? లేక ఉద్యోగరీత్యా సెటిల్ అయిన ప్రాంతంలోనే తమ ఓటు హక్కును వినియోగించుకుంటారా అంటూ రాజకీయ పక్షాలు ఆరా తీస్తున్నాయి. ఏపీలో పార్లమెంట్ ఎన్నికలతోపాటు అసెంబ్లీ ఎన్నికలు కూడా జరుగుతుండడంతో ఆంధ్రాకు చెందిన కమ్మ, కాపు సెటిలర్లు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గెలుపు కోసం అక్కడకు వెళ్లి ఓట్లు వేస్తారన్న ప్రచారం సాగుతోంది. వారికి చంద్రబాబు సీఎం కావడం మొదటి ప్రాధాన్యంగా ఉంటుందంటున్నారు. రాలయసీమ ప్రాంతానికి చెందిన రెడ్లు జగన్ కోసం అక్కడకు వెళ్లి ఓటు వేస్తారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### పలు నియోజకవర్గాల్లో ప్రభావితం..

ఏపీలోని వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వచ్చి నగరంతోపాటు శివారు నియోజక వర్గాల్లో భారీ సంఖ్యలో సెటిల్ అయ్యారు. ఇలా జీహెచ్ ఎంసీ పరిధిలోని 25 అసెంబ్లీ నియోజక వర్గాలలో 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వీరి పట్టు ఎక్కువగా ఉందని తెలుస్తోంది. ఆంధ్రా ప్రాంతం నుంచి వచ్చి సెటిల్ అయిన వాళ్లు చేవెళ్ల, సికింద్రాబాద్, మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గాల్లో కూడా ప్రభావితం చూపే అవకాశం ఉందని రాజకీయవర్గాలు తరచూ ఆందోళన వ్యక్తం చేస్తుంటాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ ఓడిపోవడానికి ప్రధాన కారణంగా సెటిలర్లే అన్న చర్చ రాజకీయ వర్గాలో జరుగుతోంది. హైదరాబాద్‌లో సెటిల్ అయిన వాళ్లలో తెలంగాణ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన వాళ్లు ఓటు వేసేందుకు సొంత ఊళ్లకు వెళ్లిపోగా, ఆంధ్రా సెటిలర్లు మాత్రం ఇక్కడే ఓటు వేశారు. సెటిలర్లు ఎక్కువగా బీఆర్ ఎస్ కు ఓట్లు వేయడంతో కాంగ్రెస్ ఓడిందన్న అభిప్రాయం ఆ పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

### ఏపీలో వివాదం..

ఇటీవల ఏపీలో ఓటర్ల జాబితా అంశం వివాదాస్పదం అయింది. డబుల్ ఓటర్లు ఉన్నారని వైసీపీ, ఫేక్ ఓటర్లు ఉన్నారని టీడీపీ ఆందోళనలు చేశాయి. ఈ అంశంపై న్యాయస్థానాల వరకూ వెళ్లి పోరాడారు. గతంలో తిరుపతి, బద్వేలు, ఆత్మకూరు ఉపఎన్నికల సందర్భంగా పెద్ద ఎత్తున ఫేక్ ఓటర్లను తీసుకు వచ్చి ఓట్లు వేయించుకున్నారని ఆరోపించారు. ఫేక్ ఓటర్ల అంశంపై ఓ ఐఏఎస్ తోపాటు పలువురు అధికారులపైనా వేటు పడింది. ఈ వివాదం ఇంకా కొనసాగుతోంది. ఇదే సమయంలో వైసీపీ హైదరాబాద్ లో ఉన్న డబుల్ ఓటర్ల గురించి ఫిర్యాదు చేశారు. అయితే దొంగ ఓటర్ల బస్సులు ఎక్కువగా వచ్చింది తమిళనాడు వైపు నుంచేనని గుర్తించారు. ఇప్పుడు కూడా తమిళనాడు..ఏపీలో ఒకేసారి ఎన్నికలు జరగడం లేదు. అందువల్ల తమిళనాడు నుంచి ఓట్లేయడానికి దొంగ ఓటర్లు వచ్చే వీలుంది. దీనిని ఈసీ ఎలా అరికడుతుందో చూడాలి.

### లెక్క తేలనుందా..

రెండు తెలుగు రాష్ట్రాల్లో ఓటు హక్కు కలిగి ఉన్న వారి వ్యవహారం ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. ఆంధ్రప్రదేశ్ స్థానికత కలిగి ఉన్న వారికి స్వస్థలంతో పాటు ఉద్యోగం, ఉపాధి, విద్యాభ్యాసం కోసం తెలంగాణలో స్థిరపడిన ప్రదేశంలో కూడా ఓటు హక్కును పొందారు. ఇలా ఏపీ స్థానికత కలిగిన వారిలో ఎందరికి తెలంగాణలో ఓటు హక్కు ఉందనే విషయంలో అధికారిక లెక్క లేకపోయినా రకరకాల అంచనాలు మాత్రం ఉన్నాయి. 2018లోనే ఈ అంశం తెరపైకి వచ్చినా అప్పట్లో ఎన్నికల సంఘం ఈ అంశాన్ని చూసి చూడనట్టు వ్యవహరించింది. ఒకరికి ఒకే ఓటు నిబంధనను పటిష్టంగా అమలు చేసేందుకు భారత ఎన్నికల సంఘం (సీఈసీ) చర్యలు చేపట్టింది. ఓటరు జాబితాను పకడ్బందీగా ప్రక్షాళన చేసేందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా డబుల్ ఓట్లను తొలిగించేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. దీని ద్వారా బోగస్ ఓటర్ల ఏరివేతతోపాటు నిజమైన ఓటర్లు ఎంత మంది ఉన్నారన్న లెక్క తేలుతుందన్న ప్రచారం సాగుతోంది.

# మీ ఓటు మోదీ కోసమే..



**పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టాలి**

**మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అభివృద్ధికి అండగా నిలుస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోనీ బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు పట్టం కట్టాలని ఆ పార్టీ నాయకుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండ హంటర్ రోడ్ దీన్ దయాళ్ నగర్ లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ ఐనవోలు మండలలోని ఒంటిమామిడి పల్లి, ఐనవోలు, వర్ధన్నపేట, ఏనుమాముల నుంచి పలువురు బీఆర్ ఎస్ నాయకులు అరూరి రమేష్ అధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు సమక్షంలో బీజేపీలో చేరారు. వీరికి ధర్మారావు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. బీజేపీలో చేరిన వారిలో మాజి ఎంపీటీసీ పెండ్లి తిరుపతి రెడ్డి, మాజి ఉపసర్పంచ్ కొట్టం రాజు, వర్ధన్నపేట మాజి వార్డు సభ్యులు ఆత్మకూరు వెంకటేశ్వర్లు, 14 వ డివిజన్ బీఅర్ ఎస్ ఉపాధ్యక్షుడు పత్రి సుభాష్ తోపాటు జైపాల్, గూడ రాజి రెడ్డి, గోనె రాజు, పెంతల అశోక్, పెండ్లి ప్రశాంత్, ప్రవీణ్, నర్సింహ, రాం గోపాల్ వర్మ, నాగరాజు, అగరెడ్డి, మోహన్, రాజేశ్, సునీల్ తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, రావు అమరేందర్ రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ తాల్లపల్లి కుమారస్వామి, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గడేపల్లి రాజేశ్వర్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ కందగట్ల సత్యనారయణ, వర్ధన్నపేట నియోజకవర్గ కన్వీనర్ ముత్తిరెడ్డి కేశవ రెడ్డి, బీజేపీ నాయకులు చల్లా జైపాల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, జలగం రంజిత్ రావు, బోల్లేపల్లి మహేశ్వర్ గౌడ్, వెంకట్ రావు, రాంబాబు, జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, ఐనవోలు దేవస్థాన మాజి చైర్మన్ జైపాల్ యాదవ్, పాక్స్ చైర్మన్ రమేష్, మాజి మార్కెట్ డైరక్టర్ ఏకాంతం గౌడ్, పాక్స్ డైరక్టర్ షణ్ముక రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట మాజీ శాసనసభ సభ్యులు అరూరి రమేష్ బీజేపీలో చేరి మొదటిసారి వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు కార్యాలయానికి విచ్చేసిన సందర్భంగా వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట రంజిత్ కుమార్ తదితరులు గౌరవపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# గాదె హర్షితకు ఘన సన్మానం

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ నగరంలోని 42వ డివిజన్ రంగసాయిపేటలో బుధవారం గాదే హర్షితను తన స్వగృహంలోనే బీజేపీ డివిజన్ అధ్యక్షుడు తాళ్ల పెల్లి అర్జున్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం అర్జున్ మాట్లాడుతూ నయీమ్ నగర్ లోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో చదువుతున్న హర్షిత ఢిల్లీ ప్రోగ్రాంలో పాల్గొనడం అభినందనీయమన్నారు. మహిళలు హర్షితను ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చ అధ్యక్షురాలు కత్తి సోనీ, బీజేపీ నాయకులు చాపల నాగరాజు, బక్కి రంజిత్, ఆరె కార్తీక్, ముత్తినేని విజయ్ చందర్, క్యాథమ్ రంజిత్, గాదే రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీధర్ బాబు చిత్రపటానికి పాలాభిషేకం



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని వల్లెంకుంట గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అయిత ప్రకాష్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ గా నియమించిన సందర్భంగా వల్లెంకుంట, కొయ్యూరు గ్రామాల రెడ్డి గాండ్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఐటీ, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి గాండ్ల సంఘం అధ్యక్షుడు బొమ్మ తిరుపతి రెడ్డి, ఉపాధ్యక్షుడు కుంభం బాపు రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంతోష్ శ్రీనివాస్, కోశాధికారి అయిత స్వామి, గౌరవ అధ్యక్షుడు అయిత రాఘవ రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

## కార్యకర్తలను గుర్తిస్తున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పది సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకున్నా కాంగ్రెస్ పార్టీ జెండాను మోసి అధికారం కోసం నిరంతరం కష్ట పడిన కార్యకర్తలను గుర్తించి పదువులలో అవకాశం కల్పిస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ నాయకుడు కల్లూరి పవన్ కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు కల్లూరి పవన్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయిని నియమించాడని గంగపుత్ర సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు.

## ఇప్పలపల్లె శివారులో అక్రమ ఇసుక డంపులు



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని ఇప్పలపల్లె శివారు మానేరు నది నుంచి గత వారం రోజులుగా అక్రమ ఇసుక రవాణా జరుగుతున్న పట్టించుకునే వారే కరువయ్యారు. మానేరు నది నుంచి రాత్రి సమయంలో పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుకను ఇప్పలపల్లె శివారు ప్రాంత పొలాల వద్దకు తరలించి అక్కడి నుంచి గుట్టు చప్పుడు కాకుండా లారీల్లో వరంగల్, హైదరాబాద్ వంటి నగరాలకు తరలించి లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పలపల్లె శివారులో ఎక్కడ చూసినా అక్రమ ఇసుక డంపులే దర్శనం ఇస్తున్న అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. ఇప్పలపల్లె శివారు మానేరు నది మా పరిధిలోకి రాదంటూ అటు కాటారం ఇటు మల్హర్ మండలాల అధికారులు పట్టించుకోకపోవడం అక్రమార్కులకు వరంగా మారుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణా పై కఠిన చర్యలు తెసుకోవాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

## మంత్రి కొండా సురేఖను కలిసిన ఎండీ రియాజ్



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** గ్రంథాలయాల సంస్థ రాష్ట్ర చైర్మన్ గా నియమితులైన ఎండీ రియాజ్ హైదరాబాద్ లో అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ రియాజ్ కు శుభాకాంక్షలు తెలిపారు.

# పంటల పిచికారిపై రైతులకు అవగాహన



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండల కేంద్రంలోని పాత గ్రామపంచాయతీ కార్యాలయంలో రైతులకు పంటలపై పిచికారీ ఎలా చేయాలో ఎస్సార్ యూనివర్సిటీ అగ్రికల్చర్ విద్యార్థినులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మందు ద్రావణం తయారు చేయడానికి శుభ్రమైన నీటిని మాత్రమే వాడాలన్నారు. స్ప్రేయర్ లోని ఫిల్టర్లను, నాజీలను, పైపులను తరచుగా శుభ్రపరుచుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతంలో నిరక్ష్యరాస్యులైన రైతాంగం, రైతు కూలీలకు పంటలకు పురుగు మందుల పిచికారీ సమయంలో సరైన అవగాహన లేకపోవటంతో జాగ్రత్తలపై ఏమాత్రం శ్రద్ధపెట్టటం లేదన్నారు. పురుగు మందుల పిచికారీ సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోవటం వల్ల కొన్ని సందర్భాల్లో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటపొలాల్లో పురుగు మందులు పిచికారీ సమయంలో రైతులు జాగ్రత్తలు పాటించటం మంచిదని, పురుగుమందు పిచికారీలో సూచనలు, పురుగు మందు పిచికారి చేసే సమయంలో రక్షణగా దుస్తులు, చేతికి గ్లౌజులు, ముక్కుకు, కండ్లకు రక్షణగా కవచాలు ధరించాలన్నారు. సస్యరక్షణ మందులు మానవ శరీరంలోని వివిధ భాగాల నుంచి లోపలికి ప్రవేశిస్తాయని, కాబట్టి, రక్షణ దుస్తులు తప్పనిసరిగా వాడాలని సూచించారు. పిచికారీ చేసిన వెంటనే సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. మందులు పిచికారి చేసే సమయంలో నీరు త్రాగడం, ఏవైనా ఆహారాలు తినడం, గుట్కాలు నమలడం, పాన్ పరాకులు నమలడం, పొగ త్రాగడం, చేతి వేళ్లతో కళ్లను నలపడం చేయరాదన్నారు. అలాగే పిల్లలతో పురుగు మందుల పిచికారి చేయించకూడదని, సస్యరక్షణ మందులు పిచికారి చేసిన పొలంలో గానీ, పొలం చుట్టూ ఉన్న గట్ల పైగానీ, పశువులను మేపటం చేయకూడదని తెలిపారు. ఆహార పంటలపై, కూరగాయ పంటలపై, పశుగ్రాస పంటలపై, సస్యరక్షణ మందులు పిచికారి చేసినప్పుడు 8 నుంచి 10 రోజుల వరకు వేచి ఉండి తర్వాత పంటలు కోయడం గానీ, కూరగాయలు కోయడం, పశుగ్రాసం కోయటం చేపట్టాలన్నారు. పురుగుమందు వాడేసిన కాళీ డబ్బాలను పొలంలో చిందరవందరగా వదిలేయకుండా గుంత తీసి పూడ్చి వేయాలని, ప్లాస్టిక్ డబ్బాలను కాల్చివేయాలని రైతులకు ఎస్సార్ యూనివర్సిటీ అగ్రికల్చర్ విద్యార్థినీలు శ్రీలత, శరణ్య, భవాని, గాయత్రి, సింధూరావు, జోష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## రేపు ఆకాశవాణిలో 'కవితా ఓ కవితా'



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రపంచ కవితా దినోత్సవం పురస్కరించుకొని "కవితా ఓ కవితా" అన్న శీర్షికన ఆకాశవాణి వరంగల్ కేంద్రం గురువారం ఉదయం 7:15 నిమిషాలకు కవి సమ్మేళనం ప్రసారం చేయనుందని ఆకాశవాణి వరంగల్ కార్యక్రమ అధికారి శ్రీ ఇల్లెందుల రవికుమార్ తెలియచేశారు. ఆకాశవాణి వరంగల్ కేంద్ర ప్రాంగణంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో వల్లంపట్ల నాగేశ్వర రావు, డాక్టర్ జరీనా బేగం, చేపూరి రామారావు, డాక్టర్ మంతెన శంకర్, పొట్లపల్లి శ్రీనివాసరావు, రామేశ్వర రాజు, బిల్లా మహేందర్, వనపర్తి పద్మావతి, హాజీ నూరానీల రచనలు ముందుగా రికార్డ్ చేశామని రవికుమార్ తెలిపారు. ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా ప్రసారం చేస్తున్న ఈ కవి సమ్మేళనంలో గేయాలు, పద్యాలు, వచన కవితలు, మినీ కవితలు, మణిపూసలు ఇలా అన్ని ప్రక్రియలకు ప్రాధాన్యం ఇచ్చామని రవికుమార్ పేర్కొన్నారు. కేవలం గత నెల రోజుల కాలంలో ఎన్నో విశిష్ట కార్యక్రమాలకు రూపకల్పన చేసి ప్రసారం చేశామన్నారు. కిసాన్ దినోత్సవం ఘనంగా నిర్వహించి14మంది రైతు సోదరులను సత్కరించామని, మహిళావారోత్సవాలను పురస్కరించుకొని ఎనిమిది రోజుల పాటు వైవిధ్యభరితమైన కార్యక్రమాలను ప్రసారం చేశామని తెలిపారు.

## బీజేపీ గెలుపునకు సమాయత్తం కావాలి

### డాక్టర్ పెసరు విజయ చందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** దామెర మండలం కేంద్రంలో మండల అధ్యక్షుడు జంగిలి నాగరాజు ఆధ్వర్యంలో మండలం కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, హుజురాబాద్ నియోజకవర్గం ప్రభారి డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి పాల్గొని రాబోయే లోక్ సభ ఎన్నికలలో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎన్నికల తయారీ, సంస్థాగత విషయాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు పటిష్టమైన ప్రణాళికతో పనిచేయాలన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీ హవా ఉందని, తీరిగి కేంద్రంలో తప్పకుండా బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు గురజాల శ్రీరామ్ రెడ్డి, అసెంబ్లీ కో కన్వీనర్ మాదారపు రతన్ కుమార్, ప్రధాన కార్యదర్శులు గన్ను సతీష్, వేల్పుల రాజకుమార్, పీఏసీఎస్ డైరెక్టర్ పొగడాల మధుకర్, సిలువేరు చంద్ర కిరణ్, దంసాని శ్రీనివాసరెడ్డి, సమ్మి రెడ్డి, ఎక్కాలదేవి రమేష్, రాజశేఖర్, రాజు, గండు పరుశురాం, పెంట రమేష్, ఇదినూరి రాకేష్, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇంచార్జిలు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పాలిట శాపంగా మారిన సహకార సంఘం



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ సర్కార్ రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ హామీ ఇవ్వగా రైతులకు రుణాలు ఇవ్వడానికి సుమారు రూ.8 కోట్లు సహకార సంఘంలో ఉన్నప్పటికీ రైతులకు రుణాలు ఇవ్వక రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కొత్త సభ్యులు రుణాల కోసం ఎదురుచూడబట్టి సుమారు పది సంవత్సరాలు గడుస్తున్నా నేటి వరకు కూడా వారికి రుణాలు దక్కడం లేదు. రైతులకు రుణాలు ఇవ్వవలసిన పాలకవర్గం వారి జేబులు నింపుకోవడానికి మార్కెట్ రేటుకు మించి భూములు కొనడం, గోదాముల నిర్మాణం వైపే మొగ్గుచూపడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఈ విషయంపై డీసీఓ సంజీవరెడ్డిని వివరణ అడగగా చెన్నారావుపేట సహకార సంఘం వారికి గోదాముల నిర్మాణానికి, భూమి కొనుగోలుకు సంబంధించి ఎటువంటి అనుమతులు లేవని తెలియజేశారు. ఒకవేళ అటువంటి చర్యలు ఏమైనా సంఘం తరఫున జరిగి ఉంటే పాలకవర్గాన్ని భర్తరఫ్ చేస్తానని కార్యదర్శిని విధుల నుంచి తొలగిస్తానని తెలియజేశాడు. చెన్నారావుపేట రైతులు పంటల దిగుబడి లేక పంట నష్టాల తోటి కుదేలై ఉన్నందున రైతులకు 67వ సాధారణ మహాసభ సమావేశం రోజు కంటే ముందుగానే ప్రతి సభ్యుడికి అర్హతకు తగ్గట్టుగా పంట రుణాలు ఇవ్వాలని చెన్నారావుపేట సొసైటీ మాజీ వైస్ చైర్మన్ తొగరు చెన్నారెడ్డి డిమాండ్ చేశారు. ఇవ్వని పక్షంలో ఆదివారం నుంచి నిరవధిక నిరాహార దీక్ష చెన్నారావుపేట సొసైటీ కార్యాలయంలో చేస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రైతులు దేశెట్టి రాజు, ఇరుకుల శ్రీను, జక్క వెంకటేశ్వర్లు, భూక్య బద్రు, చిలుకూరి నగేష్, సముద్రాల భిక్షపతి, నూనె వాసుదేవ్, రాదారపు ఏకాంబరం, వల్లజి శ్రీను, వంగపల్లి రాజు, ఇండ్ల సునీల్, తదితరులు పాల్గొన్నారు.

# పిచ్చుకలను పరిరక్షించుకోవాలి

## మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ భాస్కర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రపంచ పిచ్చుకల దినోత్సవ సందర్భంగా ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను బుధవారం హనుమకొండ చౌరస్తాలోని మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ భాస్కర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చూడడానికి చిన్న ప్రాణే అయినా, జీవవైవిధ్యంలో తన వంతు పాత్రను పోషిస్తోన్న పిచ్చుకలు నగరాలు కాంక్రీట్ జంగిళ్లగా మారడం మూలాన కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడిందన్నారు. కమ్యూనికేషన్ రంగంలో వచ్చిన విప్లవం వల్ల పెరుగుతున్న రేడియేషన్ వల్ల చిట్టి గువ్వలు బలవుతున్నాయన్నారు. అంతరిస్తున్న పక్షుల జాబితాలో ఉన్న పిచ్చుకలను సంరక్షించాలన్న లక్ష్యంతో ఏటా మార్చి 20న పిచ్చుకల సంరక్షణ దినంగా ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నామన్నారు. ఇదే స్ఫూర్తితో వరంగల్ వైల్డ్ లైఫ్ సొసైటీ ఆధ్వర్యంలో పలు రకాల వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఆ సంస్థ నిర్వహకులైన శ్యామ్ సుందర్, నాగేశ్వర్ రావులను అభినందించారు. పర్యావరణాన్ని తన శక్తిమేరకు కాపాడే పిచ్చుకలను రక్షించేందుకు పక్షి ప్రేమికులు నడుం బిగించాల్సిన పరిస్థితి వచ్చిందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని పురస్కరించుకుని వాటి సంరక్షణ కోసం గిఫ్ట్ ఏ నెస్ట్ అనే కార్యక్రమాన్ని ప్రారంభిస్తునట్లు ప్రకటించారు. వేసవికాలం రానున్న తరుణంలో చెట్లన్ని ఎండిపోయి పక్షులకు ఆవాసం, తాగునీరు కరువై వేలాది పక్షులు మృత్యువాత పడుతున్నాయని కాబట్టి, వాటిని సంరక్షించడం కోసం ప్రజలందరూ ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సోదా కిరణ్, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ బాధ్యులు శ్యామ్ సుందర్ శర్మ, నాగేశ్వర్ రావు, పర్యావరణ ప్రేమికులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న పంట క్షేత్ర ప్రదర్శన




**వరంగల్ వాయిస్, పరకాల :** కావేరి కంపెనీ ప్రతినిధులు కేఎంహెచ్-8333 మొక్కజొన్న పంటను క్షేత్ర ప్రదర్శన పరకాల మండలంలోని వెల్లంపల్లి గ్రామంలో నిర్వహించారు. మొక్కజొన్న ప్రదర్శనకు వెల్లంపల్లి, సీతారాంపురం, నడికూడ, పోచారం, కౌకొండ, సర్వాపురం, రాయపర్తి గ్రామాలకు చెందిన రైతులు క్షేత్ర ప్రదర్శన చేసి వారి సమస్యలకు కావేరీ కంపెనీ ఆర్ బీఎం రాఘవేంద్ర పరిష్కారం చూపడం జరిగింది. ఎకరాకు 40 క్వింటాళ్ల పైనా వస్తుందని గింజలు పైనా కొన వరకు వచ్చి బెండు సన్నగా వస్తుందని రైతు రాజు తెలిపారు. ఇంత మంచి విత్తనం ఇచ్చిన కావేరీ కంపెనీకి కృతజ్ఞతలు చెప్పారు.

## కుడా చైర్మన్ ఇనుగాలకు శుభాకాంక్షలు తెలిపిన డాక్టర్ రామకృష్ణ



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** వరంగల్ ఎంపీ ఆస్పిరెంట్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ హైదరాబాద్ లోని కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి నివాసంలో బుధవారం జిల్లా నాయకులతో కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ ఇనుగాల సొంత గ్రామం నాది కూడా అయినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లాలో సీనియర్ నాయకుడిగా అందరికి ట్రస్ట్ ద్వారా సేవలందిస్తురన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ కన్వీనర్ ఆరూరి సాంబయ్య, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు నందిపాక భాస్కర్, భీమదేవరపల్లి మండలాధ్యక్షుడు ఎస్సీ సెల్ కిరణ్, వల్లాల జగన్ గౌడ్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ జిల్లా నూతన కమిటీ ఎన్నిక





**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా సమితి జక్కు రాజు అధ్యక్షతన బాలసముద్రం, హనుమకొండలోని ఏఐటీయూసీ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యస్.బాలరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసు రత్నం హాజరయ్యారు. ఈ సమావేశంలో ఏకగ్రీవంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా కమిటీ అధ్యక్షుడిగా వేల్పుల సారంగపాణి, వర్కింగ్ ప్రెసిడెంట్ గా ధర్మాల రాంమూర్తి, ఉపాధ్యక్షులుగా ఆదరి రమేష్, మాలోతు శంకర్ నాయక్, కర్రే లక్ష్మణ్, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజు గౌడ్ , సహాయ కార్యదర్శిగా రామ రాజేష్ ఖన్నా, నేదునూరి రాజమౌళి, గుంటి రాజేందర్, గడ్డం లలిత, కవ్వంపల్లి కిషన్, లంకదాసరి అశోక్ వీరితో పాటు కార్యవర్గం 35 మంది తో కౌన్సిల్ తో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యస్.బాలరాజు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏసు రత్నం హాజరై మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలన్నారు. భారత రాజ్యాంగాన్ని మార్చి మనుధర్మ రాజ్యాంగాన్ని తీసుకురావాలని ఆరాటపడుతున్నారని, ఈసారి ఎన్నికలలో బీజేపీని అధికారంలోకి రాకుండా కార్మిక వర్గం పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అరూరి రమేష్‌ను కలిసిన మామిడాల సతీష్



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని రాష్ట్ర బీజేపీ నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్ రావు నివాసానికి వచ్చిన బీజేపీ నాయకుడు అరూరి రమేష్ ను బుధవారం 19వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు మామిడాల సతీష్ కట్టర్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అలీ, అజయ్ బాబు, గడ్డం భాస్కర్ పాల్గొన్నారు.

## ఎయిడ్స్ నిర్మూలనకు యువత పాటుపడాలి



**వరంగల్ వాయిస్, ములుగు :** నెహ్రూ యువ కేంద్ర వరంగల్ ఆధ్వర్యంలో ములుగు జిల్లా లోని సఖి కేంద్రంలో ఎయిడ్స్ పై అవగాహన సదస్సును బుధవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి చింతల అన్వేష్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఆకవరం శ్రీనివాస్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాల నుంచి 29 సంవత్సరాల మధ్య వయసు వాళ్లే ఎక్కువగా ఈ వ్యాధికి గురవుతున్నారని, ఎయిడ్స్ వ్యాధి పట్ల యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధి పట్ల యువత అవగాహన పెంచుకోవడంతో పాటు నిర్లక్ష్యంగా ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఎయిడ్స్ హెచ్ఐవీ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపించకుండా, సానుకూల దృక్పథంతో చూడాలని, ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనలో యువత భాగస్వామ్యం కావాలని చెప్పారు. అనంతరం జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్ పర్సన్ కే వసుధ మాట్లాడుతూ ముఖ్యంగా కాలేజీ యువత చెడు వ్యసనాలకు దురాలవాట్లకు లోను కాకుండా మంచి అలవాట్లను పెంపొందించుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యాసరచన, చిత్రలేఖన, పెయింటింగ్, క్విజ్ కాంపిటీషన్ నిర్వహించి ప్రతిభ కనబరిచిన ముగ్గురు విజేతలకు నగదు బహుమతిని అందించారని నెహ్రూ యువ కేంద్ర యూత్ ఆఫీసర్ అన్వేష్ తెలిపారు. రిసోర్స్ పర్సన్స్, క్లస్టర్ ప్రాజెక్ట్ మేనేజర్ జ్యోతి, కౌన్సిలర్ కౌన్సిలర్ రవీందర్ లు, ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జాతీయ యువజన అవార్డు గ్రహీత ఆకులపల్లి మధు, డీసీపీఓ ఓంకార్, పొనిక్ హరికృష్ణ, పీఓఐసీ కృష్ణవేణి, డీసీపీయూ, చైల్డ్ లైన్, సఖి, ఉమెన్ హబ్ సిబ్బంది, డిగ్రీ కళాశాల విద్యార్థులు ఈ అవగాహన సదస్సులో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పోలీసుల విస్తృత తనిఖీలు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా ఎన్నికల కోడ్ నేపథ్యంలో మహబూబాబాద్ పట్టణంలో డీస్పీ ఎన్. తిరుపతిరావు ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మహబూబాబాద్ రైల్వే స్టేషన్, బస్టాండ్ , నెహ్రూ సెంటర్ తో పాటు వివిధ సెంటర్లలో బాంబు స్కాడ్ తనిఖీలు నిర్వహించారు. అనుమానం ఉన్న వ్యక్తుల పై ఆరా తీస్తున్నారు. రైల్వే స్టేషన్ లో ఉన్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. తనిఖీలో మహబూబాబాద్ టౌన్, రూరల్, టౌన్ సీఐ ,పోలీసుల పాల్గొన్నారు.

## గీత కార్మికుడికి ఎక్స్ గ్రేషియా చెల్లించాలి

### మోకుదెబ్బ రమేష్ గౌడ్ డిమాండ్



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలం లోని భోజర్వ్ గ్రామంలో తాటి చెట్టుపై నుంచి పడి చనిపోయిన దీకొండ నాగేశ్వర్ రావు గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం రూ. 25 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ డిమాండ్ చేశారు. బొజర్వ్ గ్రామంలో బుధవారం తాటి చెట్టుపై నుంచి పడి చనిపోయిన నాగేశ్వర్ రావు పార్థివ దేహం పై రమేష్ గౌడ్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కీశే. నాగేశ్వర్ రావు గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకట్ గౌడ్, రాష్ట్ర నాయకులు మద్దెల సాంబయ్య గౌడ్, దొమ్మటి పురుషోత్తం గౌడ్, కత్తి స్వామి గౌడ్, బండి రమేష్ గౌడ్, బోడిగే నరేందర్ గౌడ్, బుర్ర సుదర్శన్ గౌడ్, బోడిగే వెంకట్ గౌడ్, మేడి ప్రభాకర్ గౌడ్, సుధాకర్ గౌడ్, గండు రాజు గౌడ్, రామగోని రవి గౌడ్, మదూరి బుచ్చిరాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష ప్యాడుల అందజేత



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ఎల్బీనగర్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు హెల్పింగ్ హార్ట్స్ సంస్థకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ రామకృష్ణ దాతల సహకారంతో 150 మందికి పరీక్ష ప్యాడులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ నర్సింగారావు, ఉపాధ్యాయులు పోగు అశోక్, కవిత, రమేష్, శ్రీనివాస్, తిలక్, ఇష్తికార్ అలీ, నీరజ, లక్ష్మి స్వప్న పాల్గొన్నారు.

# గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కొండా సురేఖ



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** రాజ్ భవన్ లో నిర్వహించిన తెలంగాణ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరయ్యారు. పదవీ బాధ్యతలు చెపట్టిన గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ కు మంత్రి సురేఖ శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం చేపట్టిన సంక్షేమ యజ్ఞానికి సంపూర్ణ సహకారం అందించాలని గవర్నర్ ను ఈ సందర్భంగా ఆమె కోరారు.

## ఆస్తి పన్ను వసూళ్లలో వినూత్న నిరసనలు



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మున్సిపాలిటీకి ప్రధాన ఆదాయ వనరైన ఆస్తి పన్ను వంద శాతం వసూలు చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని మున్సిపల్ కమిషనర్ పి.శాంతి కుమార్ అన్నారు. బుధవారం తోరూర్ పట్టణంలోని పేరుకుపోయిన బకాయి వసూళ్లలో భాగంగా కొన్నింటిని సీజ్ చేశామని, డప్పులతో వినూత్న నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని, గులాబీ పూలు ఇచ్చి టాక్స్ కట్టాలని వినూత నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి గాను భారీగా పేరుకుపోయిన ఆస్తి పన్ను దారులకు నోటీసులు ఇచ్చి రెండు మూడు రోజులుగా సంబంధిత పేరుకుపోయిన బకాయిదారులకు మౌఖికంగా చెప్తున్నా కానీ, ఇంతవరకు టాక్స్ కట్టని సముదాయాలను సీజ్ చేయడం జరిగిందన్నారు. గులాబీ పూలు ఇచ్చి పేరుకుపోయిన మున్సిపల్ టాక్స్ కట్టాలని పూలతో వినూత్న నిరసన చేపట్టడం జరిగిందన్నారు. మున్సిపల్ శాఖ ఆస్తి పన్నుపై అధిక మొత్తంలో పెనాల్టీ పైన 90 శాతం మినహాయింపు ఇస్తున్నందున అందరూ ఉపయోగించుకోవాలన్నారు. పేరుకుపోయిన తమ ఆస్తి పన్నులను 90 శాతం మినయింపుతో సకాలంలో చెల్లించి లబ్ధి పొందాలన్నారు. అలాగే పట్టణ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ కట్ట స్వామి, హెల్త్ అసిస్టెంట్ రాజు, వార్డు ఆఫీసర్లు దేవేందర్, పట్టాభి, నవీన్, ఉపేంద్ర, రేణుక, బిల్ కలెక్టర్లు శంకర్, యాకయ్య, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# శరవేగంగా 'బ్రిడ్జి'పనులు

### రూ.2.20 కోట్లతో జంషెడ్ బేగ్ పేట వాగుపై బ్రిడ్జి నిర్మాణం



**వరంగల్ వాయిస్, రేగొండ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఉమ్మడి రేగొండ మండలం, నూతనంగా ఏర్పడిన గోరికొత్తపల్లి మండలం జెంషెఢ్ బెగ్ పేట వద్ద నున్న వాగుపై రూ.2 కోట్ల 20లక్షలతో బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టడంతో రైతులు వాహన దారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నూతన గోరికొత్తపల్లి మండలానికి, అబ్బాపూర్, ములుగు, జాకారం, తదితర తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు జెంషెఢ్ బెగ్ పేట వద్ద వాగు ఉంది. నిత్యం వేల సంఖ్యలో దీనిపై వాహనాదారులు రాకపోకలు సాగించుంటారు. ప్రధానంగా మండలంలో ఉన్న కార్యాలయానికి ఇతర అవసరాల నిమిత్తం వాగుపై నుంచి రేగొండకు వస్తుంటారు. సాధారణ రోజుల్లో బ్రిడ్జి పై నుంచే ఆటోలు, ద్విచక్ర వాహనాలు వెళతాయి. అయితే వర్షాలు కురిసినప్పుడు రాకపోకలు నిలిచిపోతాయి. ఆ సమయంలో 10 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించి గమ్యస్థానం చేరుకోవలసి ఉంటుంది. దీని వల్ల రెండు మండలాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకొని బ్రిడ్జి నిర్మాణానికి గత ప్రభుత్వం దీనికి వంతెన నిర్మాణానికి ఎన్నికల కంటే ముందు అప్పటి శాసనసభ్యుడు రూ.2.20 కోట్ల రూపాయలతో మంజూరు చేసి ప్రారంభించి వదిలేశారు. నూతన మండలం రహదారి దృష్టిలో పెట్టుకొని స్థానిక ప్రస్తుత ఎమ్మెల్యే, ఈ బ్రిడ్జి నిర్మాణానికి కాంట్రాక్టర్ నిర్మాణపు పనులను ప్రారంభించి వేగవంతం చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో నూతన బ్రిడ్జి ఏర్పాటు కానుండడంతో ఇటు ప్రజలు అటు వాహనదారులకు ఇబ్బందులు లేకుండా సునాయసంగా తమ వాహనాల ద్వారా వచ్చేందుకు అవకాశం ఏర్పడుతుందని, ఆయా గ్రామల, మండలాల, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# గాలికుంటు వ్యాధులకు టీకా ఎంతో రక్షణ

### జిల్లా పశు వైద్య, సంవర్ధక అధికారి డా.బి శ్రీదేవి



**వరంగల్ వాయిస్, రేగొండ :** గేదేలు, తెల్లజాతి పశువులు గొర్రెలు మేకలు యజమానులు గాలికుంటు వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశు వైద్యా, సంవర్ధక అధికారి డా.బి శ్రీదేవి సూచించారు. జాతీయ పశువుల నివారణ కార్యక్రమంలో మంగళవారం రేగొండ వైద్యాధికారి డాక్టర్.వి మైథిలి ఆధ్వర్యంలో వ్యాధి నివారణ టీకాలు వేస్తుండగా ముఖ్యఅతిథిగా శ్రీదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 15 నుంచి ఏప్రిల్ 14 వరకు ఉమ్మడి మండలంలోని అన్ని పరిధిలోని గ్రామాలలో పశు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో పశువులకు టీకాలు వేస్తున్నట్లు వారు తెలిపారు. ఉమ్మడి మండలం కేంద్రంలోని 100 వరకు తెల్ల పశువులకు, 150 వరకు నల్లజాతి పశువులకు టీకాలు వేయడం జరిగిందని, ఇప్పటివరకు దాదాపుగా 1200 పశువులకు టీకాలు వేశామని వారు పేర్కొన్నారు. మూడు నెలలలోపు పశువులు మినహా మిగిలిన వాటన్నింటికీ గ్రామాల వారీగా వెళ్లి టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి అరు నెలలకు ఒకసారి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ వైరస్ ఎండాకాలంలో 14 రోజుల వరకు చలికాలంలో నాలుగు వారాల వరకు జీవిస్తుందనీ, ఈ వ్యాధి సోకిన పశువుల నుంచి, ఇతర పశువులకు గాలి ద్వారా పశువుల పాకలో ఉపయోగించే పరికరాల కూడా వ్యాప్తి చెందుతుందని, కాబట్టి మండలంలోని పాడి రైతులు వ్యాధి సోకకుండా పశువులకు ముందుగానే ఈ టీకాలను వేయించుకోవాల్సిందిగా రైతులకు వారు సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏ. కవిత, లక్ష్మణ్, కిషన్ గోపాలమిత్ర రైతులు తదితరులు పాల్గొన్నారు

# శరీర దానానికి 25 మంది అంగీకారం

### కేఎంసీకి హామీ పత్రాల అందజేత



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మరణానంతరం తమ మృతదేహాలను కుటుంబ సభ్యుల ద్వారా వైద్య విద్య నిమిత్తం దానం చేస్తామని అంగీకారం తెలుపుతూ హామీ పత్రాలు, “”తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా”” ఆధ్వర్యంలో కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మోహన్ దాస్, అనాటమీ అధిపతి డాక్టర్ పద్మజలకు అంగీకార పత్రాలు అందజేశారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ 25 మందికి అభినందనలు తెలుపుతూ శరీర దాన విల్ సర్టిఫికెట్స్ అసోసియేషన్ ద్వారా అందజేశారు. ఈ 25 మందిలో ఉద్యోగులు, విశ్రాంతి ఉద్యోగులు, సామాజిక వాదులు ఉన్నారు. ప్రముఖ ప్రజా కవి కాళోజి మృతదేహాలను కాల్చకండి, పూడ్చకండి, వృధా చేయకండి వైద్య కళాశాలలకు దానం చేసి వైద్య విద్యకు తోడ్పడండి అన్నాడని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. మరణానంతరం నేత్ర అవయవ శరీర దానం చేసి మానవాళికి మహా ఉపకారం చేద్దామని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. వివరాలకు ఈ క్రింది సెల్ ఫోన్ నెంబర్లను సంప్రదించవలసిందిగా 8790548706, 9703738699 సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కోన్ రెడ్డి మల్లారెడ్డి, శంకర్రావు యాదవ్ ప్రధాన కార్యదర్శి, ఉపేందర్ రెడ్డి, రాజమౌళి, రాజేంద్రప్రసాద్, కేదారి పాల్గొన్నారు. అనాటమీ సిబ్బంది మహబూబ్, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

## పద్మశాలీలు చైతన్యంగా ఉంటేనే గుర్తింపు

### వేముల బాలరాజు నేత



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** పద్మశాలి కులస్తులు చైతన్యంగా ఉంటేనే భవిష్యత్తులో అన్ని రంగాల్లో రాణించవచ్చని, పార్లమెంటు ఎన్నికల్లో అన్ని పార్టీలు పద్మశాలి కులస్తులకు అవకాశం కల్పించాలని తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల బాలరాజు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో పద్మశాలీలు అత్యధికంగా ఉన్న స్థానాల్లో అవకాశం కల్పించాలని అన్ని పార్టీలకు కోరడం జరిగిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆయన అన్నారు. చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా నూతన కమిటీలు ఏర్పాటుతోపాటు సంఘం బలపేతానికి కృషి చేస్తామని ఆయన వివరించారు. బడ్జెట్ సమావేశంలో పద్మశాలి కార్పొరేషన్ కు ప్రత్యేకంగా ప్రతి సంవత్సరం 25 వందల కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. పద్మశాలి కార్మికులు గుర్తింపు కార్డులతో పాటు వారికి బ్యాంకు రుణాలు అందించి ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి రాష్ట్ర నాయకులు సామల పరమేశ్వర్, క్యామ వెంకటరమణ, పరికిపండ్ల అశోక్, గద్దె వెంకటరామయ్య, జనగామ జిల్లా ప్రచార కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇటుక బట్టీలపై చర్యలు తీసుకోవాలి



**వరంగల్ వాయిస్, మరిపెడ :** మరిపెడ పట్టణంలో అక్రమ ఇటుక బట్టీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని మరిపెడ పట్టణ యువత ఆధ్వర్యంలో తహసీల్దార్ సైదులుకు వినతిపత్రాన్నిఅందజేశారు. మరిపెడ పట్టణ శివారులో 365 జాతీయ రహదారి పక్కన పచ్చని పంట పొలాల నడుమ నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార ఆపేక్షతో స్థానికేతరులు వ్యవసాయ క్షేత్రాలను లీజుకు తీసుకొని అక్రమంగా ఇటుకల తయారీ బట్టీలను నిర్వహిస్తున్నారని తెలిపారు. పదుల సంఖ్యలో ఏకకాలంలో ఇటుక బట్టీలను తయారు చేసి వరిపొట్టు, కలప వినియోగించి బట్టీలను కాల్చుతున్నారు. దీంతో రహదారిపై పొగ, బూడిద కమ్ముకొని వాహనదారులు ప్రమాదాలకు గురి అవుతున్నారు. ఇటీవలి కాలంలో పలువురు ద్విచక్ర వాహనదారులు వాహనం నడుపుకుంటూ కళ్లు మండటంతో అకస్మాత్తుగా ఎదురుగా వస్తున్న భారీ వాహనాలకు ఢీకొట్టి తీవ్ర గాయాలపాలై అంగవైకల్యం చెంది ప్రాణాపాయ స్థితి నుంచి తప్పించుకున్నారు. పలుమార్లు స్థానిక అధికారులకు విన్నవించుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉడుగుల రాజు, గుండగాని నరేష్ ఉప్పాల సతీష్, పాకాల రఘురాం, అలవాలా యుగేందర్, అలవాలు ఉపేందర్, మీరా, గంధసిరి కృష్ణ, గంధసిరి వేణు, అలవాలు కృష్ణ, కోడి సర్వేష్ లు ఉన్నారు.

# తాళ్ల పద్మావతిలో స్కూల్ డే సంబరాలు

**వరంగల్ వాయిస్, కాజీపేట :** పట్టణంలోని సోమిడిలోని తాళ్ల పద్మావతి ఒలింపియాడ్ పాఠశాలలో స్కూల్ డే సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ స్కూల్ డే కు ముఖ్యఅతిథిగా చైల్డ్ ఆర్టిస్ట్(90 మిడిల్ క్లాస్ మెలోడీస్ ఫేమ్) రోహన్ రాయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రోహన్ రాయ్ మాట్లాడుతూ తన నాలుగో ఏటే నటనపై ఆసక్తితో తల్లిదండ్రుల ప్రోత్సాహంతో, ఈ స్థాయికి చేరుకున్నానని తెలిపారు. ఇప్పటివరకు సుమారు 12 సినిమాలు, సీరియళ్లలో నటించానని, మరో మూడు సినిమాలు చిత్రీకరణ దశలో ఉన్నాయని తెలిపారు. రోహన్ రాయ్ చెప్పిన డైలాగులకు ప్రేక్షకులు మంత్రముగ్ధులయ్యారు. అనంతరం తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం మాట్లాడుతూ ప్రతి సంవత్సరం స్కూల్ డై ను ఘనంగా నిర్వహించి, విద్యార్థులకు స్ఫూర్తినిచ్చే వ్యక్తులను ఆహ్వానించి వారి అనుభవాలను విద్యార్థులతో పంచుకునే లాగా కృషి చేస్తున్నామని తెలిపారు. చిన్నారులు చేసిన నృత్యాలు, నాటకాలు, ఎంఐఎంఈ, పిరమిడ్ విన్యాసాలు ఎంతగానో



అలరించాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు వివిధ పాఠశాలల కరస్పాండెంట్స్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన శ్రీ వేద పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులై పాఠాలను బోధించారు. దీనివలన విద్యార్థులకు ఉపాధ్యాయుల గొప్పతనాన్ని వివరించే అవకాశం ఉంటుందని ప్రధానోపాధ్యాయుడు విజయ్ అన్నారు. జిల్లా విద్యాధికారిగా ఐలి సాయి అమృత్, మండల విద్యాధికారులుగా కొండ అక్షయ్ కుమార్, ప్రధానోపాధ్యాయుడిగా చందా హర్షిత్ కుమార్, పీఈటీగా కోకిల రిషితేజ్, ఉపాధ్యాయులుగా సిరి చందన, అక్షయ, ఆద్య, త్రినయని, అవంతిక, అయాన్, మేఘన, వర్షిత్ తదితరులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వేద, సల్మా, కీర్తి రెడ్డి, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## చెన్నారావుపేటలో..



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని పాత ముద్దుపురం గ్రామంలో గల జాగృతి విద్యానికేతన్ పాఠశాలలో బుధవారం కరస్పాండెంట్ ఈగ సత్యనారాయణ ఆధ్వర్యంలో స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకటో తరగతి నుండి 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టి విద్యార్థులకు బోధన చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఈగ సత్యనారాయణ మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యార్థులు, ఉపాధ్యాయులుగా కావాలని ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని పిల్లలకు చిన్న తరగతుల నుంచే క్రమశిక్షణతో పాటు విద్యా, క్రీడలు, నిత్య కృత్యంగా చేయాలని అన్నారు. స్వయం పరిపాల దినోత్సవంలో కరస్పాండెంట్ గా పిట్టల అనన్యశ్రీ, ప్రధానోపాధ్యాయురాలుగా హంస అక్షయ, డీఈఓగా వి.సుశాంత్, ఎంఈఓగా సాయి జ్యోతి, చాత్రో ఉపాధ్యాయులుగా గాయత్రి, అభినయ, అక్షయ, అమూల్య, లాస్య, రుత్విక్, మన్విక్, అఖిల్, సాయి చరణ్, హారికలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఈగ సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయురాలు గోదాదేవి, ఉపాధ్యాయురాలు శిరీష, గీతా, కవితా, సరస్వతీ తదితరులు పాల్గొన్నారు.

## కూలీలకు అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, సంగెం :** మండలంలోని పోచమ్మ తండా గ్రామంలో సంధ్యారాణి గ్రామైఖ్య సంఘం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ-గ్రామీణాభివృద్ధి సంస్థ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంపై కూలీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కే రవీందర్ పాల్గొని మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంపై కూలీలకు, లీడర్లకు, మహిళలకు అవగాహన కల్పిస్తూ ప్రతి కుటుంబానికి 100 పని దినాలు, గ్రామ అభివృద్ధికి, కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధి పొందాలని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ రమేష్, కార్యదర్శి రమేష్, ఎఫ్ఏ దేవ్ సింగ్, సెర్ఫ్ కమ్యూనిటీ కో ఆర్డినేటర్ బొజ్జ సురేశ్, సెర్ఫ్ వీవోఏ రజిత, సంధ్యారాణి ఓబీలు పద్మ, అరుణ, శిరీష, దేవి, శ్రీదేవి, మంగమ్మ, లలిత, స్వరూప, క్రాంతి, మహిళలు, లీడర్లు, కూలీలు పాల్గొన్నారు.

## వరంగల్ ఎంపీ టికెట్ భారతికే కేటాయించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ ఎంపీ టికెట్ కూరాకుల భారతికే కేటాయించాలని కోరుతూ హైదరాబాదులో ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్ రెడ్డిని మన అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుట్టి రంజిత్ కుమార్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు రిటైర్డ్ అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కూరాకుల భారతితో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేంనరేందర్‌రెడ్డిల చిత్రపటాన్ని బహుకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా సమాజ సేవే లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా నాయకురాలు కూరాకుల భారతికి వరంగల్ ఎంపీ టికెట్ కేటాయించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

## ప్రమాదకరంగా బీటీ రోడ్డు



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** గత వర్షాకాలం ఒకటే రోజు కురిసిన భారీ వర్షానికి బీటీ రోడ్డు మొరంతో సహా వరద తాకిడికి కొట్టుకుపోయింది. దీనికి ఇప్పటివరకు మరమ్మతు పనులు సంబంధిత అధికారులు చేయలేదని నల్లగుంట గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే నల్లగుంట పాలంపేట మధ్యలో దాదాపు నాలుగు కిలోమీటర్ల దూరంలో బీటీ రోడ్డు ఉంటుంది. ఈ రోడ్డు నుంచి రైతులు, ప్రయాణికులు వెళుతూ ఉంటారు. గత సంవత్సరం భారీగా కురిసిన వర్షం వల్ల రోడ్డు కొట్టుకుపోయి లోతైన గుంతలు ఏర్పడడంతో ఈ రోడ్డుపై ప్రయాణికులు, రైతులు నడవాలంటే భయ పడుతున్నారు. ఈ రోడ్డపై ప్రయాణిస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే బీటీ రోడ్డు మరమ్మతు పనులను సంబంధిత అధికారులు చేపట్టాలని గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు.

# చిన్నకాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీరందివ్వాలి

### జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

**వరంగల్ వాయిస్, కాటారం:** చిన్న కాళేశ్వరం స్టేజ్ 2 పంప్ హౌస్ మరమ్మతు పనులను రెండు నెలల్లో పూర్తిచేసి వానాకాలం పంటకు సాగునీరు అందివ్వాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. బుధవారం కాటారం మండలం, గారేపల్లి వద్ద రెండవ దశ పంప్ హౌస్ వద్ద బీరసాగర్ వద్ద నిర్మిస్తున్న చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి మందిరం, ఎర్ర చెరువులకు సాగు నీరు అందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న రెండు నెలల కాలంలో పంప్ హౌస్ వద్ద గోదావరి నుంచి పంప్ హౌస్ అప్రోచ్ కెనాల్, పంప్ హౌస్ మోటార్ల మరమ్మతులు పూర్తి చేయాలని తెలిపారు. మందిరం, ఎర్ర చెరువు నీటి సామర్థ్యాన్ని పెంచుటకు చేపట్టాల్సిన చర్యలపై ప్రతిపాదనలు అందచేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. రెండవ పంప్ హౌస్ వద్ద నిర్మిస్తున్న విద్యుత్ ఉప కేంద్రం పనులు వేగవంతం చేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. ఉప కేంద్రం నిర్మాణంలో పనులు జాప్యం కావొద్దని, పనులు నిరంతరాయంగా జరగాలని తెలిపారు. అలాగే పెండింగ్ ఉన్న భూ సేకరణ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. గోదావరి తీర ప్రాంత రైతులకు సాగునీరు అందించేందుకు చేపట్టిన ఈ పనుల వల్ల 45 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ప్రాజెక్టు ద్వారా 13 చెరువులకు నీరు సరఫరా జరుగుతుందని, తద్వారా పంటలకు నీటి ఇబ్బందులు లేకుండా సమృద్ధిగా నీటి సరఫరా జరుగుతుందని పేర్కొన్నారు.



అప్రోచ్ కెనాల్ పంప్ హౌస్ మరమ్మత్తు పనులను పూర్తి చేసి ఎర్ర చెరువు , మందిరం చెరువు, కొత్తచెరువు, గారేపల్లి చెరువులను గోదావరి నీటితో నింపాలన్నారు. పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు, కాలువల నిర్మాణానికి కావలసిన భూ సేకరణ ప్రక్రియకు, అలాగే అవసరమైన నిధులు మంజూరుకు ప్రతిపాదనలు అందించాలని కలెక్టర్ ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అనంతరం రెవిన్యూ ఇరిగేషన్ అధికారులతో కలిసి కాటారం మండలంలోని చింతల చెరువు, కొత్త చెరువు, మందిరం చెరువు, ఎర్ర చెరువులను, మహాదేవ పూర్ వద్ద ఆగిపోయిన పైపు లైను పనులను పరిశీలించారు. భూగర్భం నుండి పైపు లైన్లు వేస్తున్నందున రక్షణగా హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ మంగీలాల్, తహసీల్దార్ నాగరాజు, ఇరిగేషన్ డిఈలు ఉపేందర్, సూర్య, పరశురాం, ఏఈలు విజయ కుమార్, వెంకన్న, తిరుపతి, ఎం.ఈ.ఐ.ఎల్ ప్రాజెక్టు మేనేజర్ పాషా తదితరులు పాల్గొన్నారు.



# సునీత ఐతే ఓకే

## వరంగల్ లోక్‌సభకు లైన్ క్లియర్

### కాంగ్రెస్ పార్టీ మహిళా అభ్యర్థిగా మొదటి ప్రాధాన్యం

### గెలుపే లక్ష్యంగా అధిష్ఠానం ఆలోచన

### చివరి నిమిషంలో మారిన పరిణామాలు

### ఉత్కంఠగా పార్టీ శ్రేణులు



- గడ్డం కేశవమూర్తి

**పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎంపిక తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. ఎప్పటికప్పుడు మారుతున్న సమీకరణాలతో ఆశావహులతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు అత్యంత ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు. మంగళవారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ భేటీ అయ్యింది. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పలువురు కీలక నేతలందరూ ఢిల్లీలో వరంగల్ సీటు మహిళకు కేటాయించాలని అధిష్ఠానంతో చర్చలు జరిపినట్లు సమాచారం. పలువురు సీనియర్ నేతలు వరంగల్ సీటుపై పట్టుపడుతున్నప్పటికీ మహిళకు సీటు కేటాయిస్తే గెలుపు సునాయాసంగా ఉంటుందని ఆలోచించినట్లు తెలుస్తోంది. దాదాపుగా నాలుగు దశాబ్దాలకుపైగా పార్టీలో వివిధ హోదాల్లో కొనసాగుతూ.. పార్టీ కుటుంబంగా గుర్తింపు పొందిన ఎంపీ ఆనంద్‌కుమార్ సతీమణికి టికెట్ కేటాయించడం ద్వారా విజయం నల్లేరుపై నడక అవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో ఆమెకే లైన్ క్లియర్ అయినట్లు చెప్పుకొంటున్నారు.**

### ముందు వరుసలో..

ఢిల్లీ అధిష్ఠానంనుంచి తాజాగా అందుతున్న సమాచారం మేరకు కీలకపరిణామాలు చోటుచేసుకుంటున్నట్లు తెలుస్తోంది. తెలంగాణలోని 17 సీట్లలో రెండు లేదా మూడు సీట్లను మహిళలకు కేటాయించాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించినట్లు సమాచారం. ఇందులో ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానమైన వరంగల్ కూడా ఉందనే టాక్ బలంగా వినిపిస్తోంది. దీంతో ఒక్కసారిగా పరిణామాలు వేగంగా మారిపోతున్నాయి. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎంపీ ఆనంద్‌కుమార్ సతీమణి బొడ్డు సునీత పేరు టాప్‌లో ఉన్నట్లు సమాచారం.

### అధిష్ఠానం మొగ్గు..

వరంగల్ టికెట్‌ను మాదిగ సామాజిక వర్గానికే ఇవ్వాలన్న ప్రాథమిక నిర్ణయానికి పార్టీ అధిష్ఠానం వచ్చినట్లు సమాచారం.. ఈ నేపథ్యంలో వరంగల్ టికెట్‌ను మాదిగ సామాజికవర్గానికి చెందిన మహిళకు కేటాయించే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే ఇందులో ఎంపీ ఆనంద్‌కుమార్ సతీమణి బొడ్డు సునీత పేరు టాప్‌లో ఉందనే టాక్ వినిపిస్తోంది. ఢిల్లీలో మంగళవారం సాయంత్రం జరిగిన కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ భేటీలో బిగ్ ట్విస్ట్ చోటుచేసుకుందని, ఎంపీ ఆనంద్‌కుమార్ సతీమణి బొడ్డు సునీత వైపే అధిష్ఠానం మొగ్గు చూపినట్లు సమాచారం

### నాలుగు దశాబ్దాలుగా..

హనుమకొండలో సెయింట్ పాల్స్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ నిర్వాహకులుగా ఉన్న ఎంపీ ఆనంద్‌కుమార్ దాదాపు నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు. ఈ క్రమంలో పార్టీలో అనేక హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం ఎస్సీ సెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా ఉన్నారు. ఆయన సతీమణి బొడ్డు సునీత ప్రస్తుతం హనుమకొండలోని సెయింట్ పాల్స్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్నారు. చదువుకునే రోజుల్లో ఆమె ఎన్ఎస్‌యూఐలోనూ పనిచేశారు. అనంతరం పార్టీలో కొనసాగుతున్న ఆమె.. ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ పశ్చిమలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నాయిని రాజేందర్‌రెడ్డి గెలుపులోనూ కీలకంగా వ్యవహరించారు. వార్ రూమ్ ఇంచార్జిగాను ఆమె బాధ్యతలు నిర్వర్తించారు.

### రేసు నుంచి భర్త తప్పుకొని భార్య..

వరంగల్ పార్లమెంట్ స్థానానికి మొదటి నుంచి ఎంపీ ఆనంద్‌కుమార్ టికెట్ కోసం ప్రయత్నించగా.. కొందరు పార్టీ పెద్దల సూచనలు, పలు సమీకరణాల నేపథ్యంలో ఆయన సతీమణి బొడ్డు సునీతను టికెట్ రేసులో నిలిపినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే తాను వరంగల్ ఎంపీ టికెట్ రేసులో ఉన్నట్లు సునిత పలు మార్లు ప్రకటించారు. ఈ మేరకు అధిష్ఠానంతోకూడా సంప్రదింపులు జరిపారు. ఎలాగైనా పార్టీ టికెట్ దక్కేలా వ్యూహరచన చేశారు. ఆమె చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఎంపి టికెట్ ఆమెకే కేటాయిస్తూ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. అయితే అధికారికంగా ప్రకటించడమే తరువాయిగా మిగిలింది.





### బయోడేటా..

| | |
|---|---|
| పేరు | : బొడ్డు సునీత |
| భర్త పేరు | : ఎంపీ ఆనంద్ కుమార్ |
| పుట్టిన తేదీ | : 14 అక్టోబర్ 1972 |
| వృత్తి | : ప్రిన్సిపాల్, సెయింట్ పాల్స్ హైస్కూల్ |
| కులం | : ఎస్సీ (మాదిగ) |
| విద్యార్హత | : బీఎస్సీ, బీఈడీ, ప్యాషన్ డిజైనర్ ఇన్ నిఫ్ట్ |
| అడ్రస్ | : ఇంటి నెంబర్ 5-6-56, సెయింట్ పాల్స్ హైస్కూల్, జైప్రకాశ్ నగర్, హనుమకొండ |





# పిచ్చుకలను బతకనిద్దాం..

## ప్రకృతిని కాపాడడం అందరి బాధ్యత
## పర్యావరణ ప్రేమికురాలు డాక్టర్ అనితా రెడ్డి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రకృతిని కాపాడుదాం..పిచ్చుకలను బతకనిద్దాం అంటూ ప్రకృతి పర్యావరణ ప్రేమికురాలు, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ అనితా రెడ్డి పిలుపునిచ్చారు. మార్చి 20 ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా బుధవారం హనుమకొండలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వేసవిలో పిచ్చుకలు, పక్షుల దాహార్తి తీర్చడానికి మానవత్వంతో ఇంటి పెరడు, పిట్ట గోడలు, డాబాల మీద నీటి ముంతలు ఏర్పాటు చేయాలంటూ ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు పలువురికి ఉచితంగా నీటి ముంతలు అందించారు. గత ఇరవై సంవత్సరాలుగా పర్యావరణ పరిరక్షణకు ఎన్నో కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు అవగాహన కల్పించామన్నారు. కాంక్రీటు యుగంలో ఉరపిచ్చుకలు అంతరించి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని పరిరక్షించు కోవడం మన బాధ్యత అన్నారు. ప్రభుత్వం సైతం దీనిపై దృష్టి సారించాలన్నారు. అడవులను కాపాడడం, చెట్లు పెంచడం, రేడియేషన్ తో కూడిన వస్తువుల వాడకం తగ్గించడం, నీటి తొట్లను, ఆహారపు గింజలు ఏర్పాటు చేయడం వంటివి చేయాలన్నారు. ప్రకృతిని మనం కాపాడితే ప్రకృతి మనల్ని కాపాడుతుందన్నారు. భవిష్యత్ తరాలకు అందించాల్సినవి కార్లు, బంగలాలు, బంగారం కాదని పకృతిని కాపాడి స్వచ్ఛమైన గాలి, నీరు, ప్రకృతిని ఆస్తిగా అందించాలన్నారు. చిన్నతనం నుంచే పిల్లలకు ప్రకృతి యొక్క గొప్పదనం, అవసరం తెలియజేయాలన్నారు. ప్రకృతి పట్ల ప్రేమని పెంచాలన్నారు. ప్రకృతితో మమేకం అయ్యే విధంగా పిల్లలను పెంచాలని సూచించారు. మనషులలాగానే పశుపక్షాదులకు జీవించే హక్కు ఉందని వాటిని స్వేచ్ఛగా బతక నీయాలన్నారు. అంతరించి పోతున్న ఊర పిచ్చులను సమష్టి కృషితో కాపాడుకుందామని పిలుపునిచ్చారు. తన ఇంటి ఆవరణలో వందల కొద్ది మొక్కలు నాటి నీటి తొట్లను, ఆహారపు చిప్పలను ఏర్పాటు చేసి అందరికి డాక్టర్ అనితా రెడ్డి ఆదర్శంగా నిలిచారు. పబ్లిక్ గార్డెన్ వాకర్స్ కు, వివిధ కాలనీ వాసులకు సైతం అవగాహన కల్పించారు. ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక కార్యక్రమంలోను ఆమె పాల్గొన్నారు.

# కొనుగోళ్లు, బ్యాంకు లావాదేవీలపై ఆరా

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** గత నాలుగు నెలలుగా స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాల వివరాలు, బ్యాంకుల ద్వారా జరిగిన నగదు లావాదేవీలు, ఎక్కువ సంఖ్యలో కొనుగోలు చేసిన వస్తువుల వివరాలను సమర్పించాలని సంబంధిత శాఖలను జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. దీని ఆదారంగా సమావేశ వివరాలను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి తెలియజేస్తామన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రెవెన్యూ, పోలీస్, ఎక్సైజ్, తదితర శాఖల అధికారులతో డిస్ట్రిక్ట్ ఇంటెలిజెన్స్ కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. సాధారణంగా మద్యం దుకాణాలకు ఎంత మద్యం కేటాయించారు. ఈ ఎన్నికల సమయంలో ఎంత తీసుకుంటున్నారనే వివరాలను డిస్ట్రిక్ట్ ఇంటెలిజెన్స్ కమిటీ దృష్టికి తీసుకురావాలన్నారు. అనుమానాస్పద నగదు లావాదేవీలపై నిఘా పెట్టాలని, ఏక మొత్తంగా జరిగిన ఫోన్ పే, గూగుల్ పే ఖాతాలపై దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల నిర్వహణను అధికారులు, సిబ్బంది పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల నిబంధన మేరకు అన్ని రకాలుగా విచారణ చేసి నగదు, ఇతర వస్తువులను జప్తు చేసి సంబంధిత అధికారులకు నివేదికను సమర్పించాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు రాధిక గుప్తా, వెంకట్ రెడ్డి, డీఆర్ఓ వైవీ గణేష్, ట్రైనీ ఐపీఎస్ శుభం నాగారలే,



హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, నారాయణ, డీఆర్డీవో నాగ పద్మజ, జిల్లా ఖజానా శాఖ డీడీ రాజు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనివాస్, హనుమకొండ, కాజీపేట, పరకాల ఏసీపీలు దేవేందర్ రెడ్డి, తిరుమల్, కిషోర్ కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

### నిబంధనల మేరకే బ్యాంకు లావాదేవీలు..

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిబంధనల మేరకు నగదు లావాదేవీల నిర్వహణ ఉండాలని బ్యాంకర్లకు హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. బుధవారం సాయంత్రం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని వివిధ బ్యాంకర్లతో సమావేశాన్ని నిర్వహించారు.



## అంగన్వాడి కేంద్రంలో పోషణ పక్వాడ

**వరంగల్ వాయిస్, రేగొండ :** గోరికొత్తపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. అంగన్వాడీ టీచర్ ప్రియాంక ఆధ్వర్యంలో గర్భిణీ, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే అంగన్వాడి కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ శ్రీలత, పలువురు లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మీడియా సెంటర్ ప్రారంభం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** కలెక్టరేట్‌లోని డీపీఆర్ ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎంసీఎంసీ) ను వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా



ఆమె మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సమగ్ర సమాచారాన్ని ఎప్పటికపుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎంసీఎంసీ కమిటీ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, ప్రచురణ, ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలను ప్రసారం చేయడం, సంబంధిత అభ్యర్థి ప్రచార వ్యయంలో వాటిని లెక్కించడం, సోషల్ మీడియాలో అభ్యర్థులు రాజకీయ పార్టీల ప్రకటనల వంటివి సకాలంలో ఆమోదం మంజూరు చేయాలని అన్నారు. వార్తా పత్రికలు, ఇ-పేపర్‌లు, టెలివిజన్ ఛానెల్‌లు, స్థానిక కేబుల్ నెట్‌వర్క్‌లు, సోషల్ మీడియా, మూవీ హౌస్‌లు మరియు ఎస్ ఎంఎస్ లు, ఇతర ఆడియో-వీడియో విజువల్ మీడియాలతో సహా ప్రకటనలను ఎంసీఎంసీ నుంచి ముందస్తు అనుమతి పొందిన తర్వాత మాత్రమే ప్రసారం, విడుదల చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్ ఓ ఆయుబ్ అలీ, ఆదనపు పీఆర్ ఓ ప్రేమలత, ఎలక్షన్ పర్యవేక్షకులు విశ్వ నారాయణ, రమేష్, ఎంసీఎంసీ సభ్యులు శ్రీధర్, మెండు రవీందర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్



**వరంగల్ వాయిస్, మడికొండ :** పోలీస్ స్టేషన్ పరిధిలోని అయోధ్యపురం రైల్వే గేట్ పక్కన గల దారి గుండా ద్విచక్ర వాహనంపై గంజాయి తీసుకుని వస్తున్న ముగ్గురు వ్యక్తులను బుధవారం ఉదయం 8 గంటలకు పెట్రోలింగ్ డ్యూటీలో ఉన్న మడికొండ ఎస్ఐ రాజబాబు, పోలీస్ సిబ్బంది పట్టుకున్నారు. ఇందులో వేల్పుల ఆనంద్, కొంగరి పవన్ కళ్యాణ్, గాలి తరుణ్ అనే ముగ్గురికి గత కొంతకాలంగా గంజాయి త్రాగే అలవాటు ఉందని, గంజాయి తాగే సమయంలో వీరు ముగ్గురు స్నేహితులు అయ్యారు. వీరిలో వేల్పులు ఆనంద్ గత కొంతకాలంగా విశాఖపట్నం అరకు వెళ్లి అక్కడ గుర్తు తెలియని వ్యక్తుల దగ్గర ఎండు గంజాయి కొనుక్కొని వచ్చే వాడు. కాజీపేటలో దానిని చిన్నచిన్న ప్యాకెట్లు చేసి ఎక్కువ ధరకు తన స్నేహితులైన కొంగరి పవన్ కళ్యాణ్, గాలి తరుణ్ ద్వారా అమ్మించేవాడని పోలీసులు తెలిపారు. నిందితుల పైన కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లు మడికొండ సీఐ ప్రతాప్ తెలిపారు.

# పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం తగదు

## బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం తగదని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే హెచ్చరించారు. పన్ను వసూళ్ల పురోగతిపై ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కమిషనర్ పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరం లక్ష్యం రూ.



97.66 కోట్లు కాగా, ఇప్పటివరకు 60 శాతం రూ. 63.96 కోట్ల పన్నుల సేకరణ జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆర్ ఐల వారీగా వసూళ్ల పురోగతిని పరిశీలించిన కమిషనర్ వసూళ్లపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కమిషనర్ మాట్లాడుతూ పన్ను వసూళ్లకు కేవలం పది రోజులు మాత్రమే సమయం మిగిలి ఉన్నదని 95శాతం పన్ను వసూళ్లు లక్ష్యంగా ఆర్ ఐ లు, బిల్ కలెక్టర్లు అంకితభావంతో నిర్దేశించిన లక్ష్యాలను కచ్చితంగా చేరుకోవాల్సిందేనని లేనిచో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి బిల్ కలెక్టర్ వద్ద ఉన్న 100 మంది బకాయి దారుల వెంట పడి పన్నులు సేకరించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్ డిప్యూటీ కమిషనర్లు రవీందర్ కృష్ణారెడ్డి తోపాటు ఆర్ ఓలు, ఆర్ ఐ లు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com